# వయసు కోరిక

కెప్టెన్ రావు ఎప్పుడూ ఎటెన్‌షన్‌లోనే వుంటాడు.

ఉపేక్ష, అజాగ్రత్త అనేవి అతని డిక్షనరీలోనే లేవు. ఏమో. ఎప్పుడు ఏ పరీక్షని ఎదుర్కోవలసి వస్తుందో! ఏ నిమిషంలో ఏ ప్రమాదం వచ్చి నెత్తిమీద పడుతుందో అనే ధోరణిలోనే ఉంటాడు కాని, 'ఇంతట్లో మనకివచ్చే విపత్తేవిటి పోనిద్దూ' అంటూ నిర్లక్ష్యంగా కనిపించడు ఏ నిముషంలో చూసినా.

చదువుకొనే రోజుల్లో ప్రతిక్షణం అలా జాగ్రత్తగా వున్నాడు కనుకే ఫస్ట్ క్లాసు తెచ్చుకోగలిగాడు డిగ్రీపరీక్షలో. ఒక్క లెక్చరర్‌చేతగూడా పల్లెత్తుమాట అనిపించుకోకుండా నాలుగేళ్లు కాలేజీలో గడిపాడంటే, అందుకు అతని అప్రమత్తతే కారణం.

చదువు పూర్తిఅయి మిలటరీలో కమిషన్డ్ ఆఫీసరుగా సెలెక్ట్ అయ్యాడన్నా, సెలెక్ట్ అయిన మూడు నాలుగేళ్ళకే ప్రమోషన్ సంపాదించగలిగాడన్నా, తర్వాత తర్వాత సర్వీసులో ఎన్నో బహుమతులూ, మరెన్నో బిరుదులూ, ఇంకా ఎన్నో బంగారు పతకాలూ గెల్చుకోగలిగాడన్నా వాటి అన్నింటివెనకాలా ఒకే ఒక కారణం – కెప్టెన్ రావులో అసాధారణంగా కన్పించే అప్రమత్తత!

ఏ నిమిషంలోనూ అతను ఏమరి ఉండడు ... "ఏమరిపాటా ...? చాలు ... చాలు ... అసలు అతనికి రెప్పపాటే ఉండదు –" అంటారు అతనితో పనిచేసిన ఎంతోమంది మిలటరీ ఆఫీసర్లు.

అతని ఎటెన్‌షన్‌కి తార్కాణంగా ఎన్నో కథలుకూడా చెప్తారు వాళ్ళు.

వార్ ఫ్రంట్‌లో ఉండగా, ఒకరోజు అర్ధరాత్రి, అనుకోకుండా అమాంతం

శత్రువు లొచ్చి టెంట్స్‌మీద పడ్డారట! తుపాకుల మోతలూ! గ్రేనైడ్స్ శబ్దాలూ! టాంకుల చప్పుళ్ళూ ... ! ... ఏమైందో అర్థంకాక నిద్దట్లో లేచి కకావికలై అటూ ఇటు పరిగెడుతూ అంతా హాహాకారాలు చేస్తూ వుంటే, రావుమాత్రం ఒక తుప్ప వెనక్కి తప్పుకుని, నిశ్చలంగా మెషిన్‌గన్‌ని శత్రువులమీదకి గురిపెట్టి అగ్ని వర్షం కురిపిస్తూనే ఉన్నాడట తెల్లారేదాకా ... అతని గుళ్ళదెబ్బలకి ఆగలేక శత్రువులు వెనక్కి తగ్గారటకాని లేకపోతే ఆ రోజు అన్యాయంగా వెయ్యిమంది చచ్చిపోయి ఉండేవారు ... అందరిలాగా కాకుండా అతను ఆ టైముకి ఎటెన్‌షన్‌గా ఉన్నాడుకనుకే తనని తాను రక్షించుకున్నాడు, ఒక గ్రూప్ మొత్తాన్ని రక్షించాడు ...

మరోమాటు అతను ప్రయాణం చేస్తున్న విమానానికి నిప్పు అంటుకుంది. వెంటనే పైలట్‌చేత ఇంజను ఆపుచేయించి, అది మంటలతో పెద్ద కొండరాయిలా నేలమీద కూలిపోయే లోపుగా సగంమంది సైనికులని పేరాచూట్లమర్చి కిందకి కిటికీల గుండాతోసేసి, తనుకూడా ఒక పేరాచూట్‌తో ఉరికేశాడు.

అతని అప్రమత్తతకి ఇలాంటి ఉదాహరణలు ఒకటా, రెండా?

భార్యపోయినప్పుడు మాత్రం? అతను ఎంత నిశ్చింతగా ప్రవర్తించాడనీ? ... ఒక్కగానొక్క కూతురు, పూర్తిగా మూడేళ్ళయినా నిండని జానీని ఓ చేత్తో చంకని ఎత్తుకొని, మరో చేత్తో భార్య చితికి నిప్పు ముట్టించాడు ... ఆ సమయంలో కూడా ముఖంలో ఎంత ధీమా, కళ్ళల్లో ఎంత నిశ్చలత! ... గంభీరమైన అతని రూపాన్ని చూసి అంతా గజగజలాడిపోయారు ... గుండెల్లో ఎన్ని అగ్నిపర్వతాలు ఘూర్ణిల్లు తున్నాయో ... మెదడులో ఎన్ని జ్ఞాపకాల కారుమేఘాలు గర్జిస్తున్నాయో ... ముఖంలో మాత్రం ఒకే దీక్ష .... చూపులోమాత్రం ఒకే నిశ్చలత ...

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే కెప్టెన్‌రావు అప్రమత్తతకి పర్యాయపదం - జాగ్రత్తకి మరోపేరు ... నిశ్చలతకి మారు రూపం ... అతని కన్ను గప్పడం ఎవరి వల్లా కాదు ... అతనికి తెలియకుండా ఎవరూ ఏపనీ చెయ్యలేరు.

అలాంటి కెప్టెన్ రావు ఇవాళ రిటైరయిపోయి, అక్కడక్కడ జుట్టునెరిసి, వాకింగ్‌స్టిక్ తీసుకుని, వులెన్‌సూట్‌లో దర్జాగా కదులుతూ; వెనకాల లెదర్ సూట్ కేసులూ సామానూ పట్టించుకొని, పక్కని పద్దినిమిదేళ్ళ పడుచు వయస్సులో అందాల జానీ ఖరీదైన పంజాబీ డ్రెస్‌లో ఉంటే, తన చిన్ననాటి స్నేహితుడూ, ఈనాటికి ఒక పిల్లజమిందారూ అయిన రంగనాధం యింటికి కేవలం చుట్టపుచూపుగా చూసిపోదాం అని వచ్చాడంటే ఎలా నమ్మడం?

రావుకూడా అలా నమ్మమనలేదెవర్నీ.

సూటిగానే చెప్పాడు వచ్చిన మర్నాడే రంగనాథంతో –

"ఒరేయ్ రంగా! ... ఇదిరా నా బేంక్ ఎకౌంటూ. నేను సంపాదించిన ఆస్తీను ... అంతా జానీపేరే వుంది. కానైతే ఓ లక్షా ఇరవైవేలు మాత్రం నా పేర అట్టే పెట్టుకున్నా ... అదీ, మద్రాస్ అడయార్‌లోని నా బంగళా ఇవి రెండూమాత్రం నా తదంతరం జానీకి చెందుతాయి ... నీకూ, మీ అబ్బాయికీ జానీ నచ్చడం, దాన్ని నీ యింటి కోడలుగా స్వీకరించడం ఇంక అదంతా నీ యిష్టం" – అంటూ రావు చెప్పినప్పుడు రంగనాథం ఉక్కిరి బిక్కిరే అయ్యాడు. దిదిమి దీపం పెట్టుకొనే అందం – చక్కదనంతోబాటు బోలెడు ఆస్థి ... అసలు కిష్టిగాడికి ఇంతకంటే మంచి సంబంధం తేగలడా తను? ...

వాడు యమ్.బి.బి.యస్సే కావచ్చు. అందగాడే కావచ్చు. లక్షల ఆస్థీ ఉండొచ్చు... అయితేమాత్రం? జానీలాంటి పిల్ల దొరకొద్దూ? పాలరాతి బొమ్మలాంటి అందం ... అందుకు తగ్గచురుకూ తెలివీ మంచితనం ... అన్నింటికీ మించి పదిహేను లక్షల ఆస్థితో వస్తూన్న పసిడిబొమ్మను ... వెంటనే ఎగిరి గంతేసి ఒప్పుకొని వుండును... కాని ... మగపిల్లవాడి తండ్రి కాస్తంతయినా బెట్టు చూపించకపోతే ఎలా? అందుకే అన్నాడు ... "మా కిష్టయ్య రానీ ... వాడి అభిప్రాయం కూడా తెలుసుకోవాలి కదా! ఇవాళ రేపట్లో పరీక్షలయి వస్తాడు. నాలుగు రోజులు మా యింట్లో వుండు ... నీకూ మీ అమ్మాయికీ మా యిల్లేం పరాయిది కాదు" – అని.

ప్రతీదీ నిధానంగా ఆలోచించి జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవడమేకాని, తొందరపడటం, కంగారుపడి కార్యం చెడగొట్టుకోవడం అలవాటు లేని రావు కాదని ఎందుకంటాడు?

పైగా శుభ్రంగా అన్ని సౌకర్యాలు జరుగుతున్నాయి – హాయిగా వుంది – భోజనం, మకామూను.

పొద్దున్నే రావుడు వేణ్ణీలు రెడీ చేస్తాడు ...

వంటవాడు టిఫెనూ భోజనం అమరుస్తాడు ...

పడక కుర్చీలో హాయిగా జేర్లబడి సుఖంగా పైపు కాల్చుకుంటూంటే రావుడు వచ్చి కాళ్ళు పడతాడు ... మళ్ళీ ఆ రావుడే తనకి మధ్యాహ్నం, రాత్రీ పక్కవేసి ఫేన్‌వేసి వెళ్తాడు ... తన సేవలకోసం రంగనాథం ప్రత్యేకం రావుణ్ణి కేటాయించాడు...

జీడిపిక్కలా నిగ నిగ లాడుతూ కండలు తేరివున్న రావుడు తనకు కాళ్లు పడుతూవుంటే బలిసిన ఆల్సేసియన్ డాగ్ ఒకటి రెండు సార్లు జ్ఞాపకం వచ్చింది కెప్టెన్ రావుకి. దానికి అడపా తడపా ఆప్యాయంగా బిస్కెట్లు పెట్టేవాడు తను ... అది జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఇప్పుడు ఈ రావుడికి పావలా అర్ధా ఇస్తున్నాడు. ఓమాటు నవ్వుతూ అడిగాడు కూడా – "ఏరా రావుడూ! నువ్వేం తింటావు – ఇంత ఆరోగ్యంగా బలంగా దృఢంగా ఉన్నావు? పాలూ, పళ్ళూ, బ్రెడ్, బట్టర్ .....?" అని

"అయ్యగారూ! అలాంటివన్నీ మాలాంటి పేదోళ్ళకి ఎక్కడ దొరుకుతాయండీ .... ఏదో ఇంత గంజీ అన్నం ..." అంటూ వెకిలి నవ్వు నవ్వాడు రావుడు.

రావుడు సేవల్లో మూడు నాలుగు రోజులు గడిచేటప్పటికి, అనుకున్న ప్రకారం కృష్ణప్ప పరీక్షలయి రానే వచ్చాడు ... కృష్ణప్పని చూస్తూనే కెప్టెన్ రావు కళ్ళు తళుక్కున మెరిశాయి!

సన్నగా సళాకుగా బంగారు ఛాయలో మిలమిలా మెరిసిపోతున్నాడు కుఱ్ఱాడు.

పెద్ద పెద్ద కళ్ళు – సుకుమారమైన చెక్కిళ్ళు – పల్చని పెదాలు – ముట్టు కుంటే కందిపోతాడన్నంత సౌకుమార్యం ... ఎంత అందంగా వున్నాడు.

జానీకి తగ్గకుఱ్ఱాడు – ఈడూ జోడూ!

కెప్టెన్‌రావు సంతోషంగా తల పంకించాడు.

కృష్ణప్ప వచ్చిన మూడోరోజున, యధాలాపంగా కదిపినట్లు కదిపారురావూ, రంగనాధం కలిసి పెళ్ళిమాట. కృష్ణప్పకి ఎదురుగుండా కుర్చీలో జానీ కూడా కూర్చునే ఉంది ... రావుడు నలుగురికీ కాఫీలు అందిస్తున్నాడు – ఆ సమయంలో తన అభిప్రాయం తెలియబర్చాడు రావు ... "అదయ్యా నా అభిప్రాయం ... మీనాన్న కూడా అభ్యంతరం చెప్పలేదు ... మరి నీకు మా జానీ నచ్చి, మా జానీకి నువ్వునచ్చి అంతా సవ్యంగా జరిగితే ..." ఆపైన ఒక చిరునవ్వుతో వాక్యం పూర్తిచేశాడు ...

ఆ మాటలు విన్నప్పుడు కృష్ణయ్యలో ప్రస్ఫుటంగానే ఒక చలనం కనిపించింది. పెదిమలు వొణికాయి. కళ్ళు వాలిపోయాయి ... సిగ్గుతో వళ్లు కుంచించుకుపోయింది. కుర్చీలో ఇబ్బందిగా కదిలి సర్దుకుని కూర్చున్నాడు ... నేల చూపులు చూస్తూ ఉండిపోయాడే కాని, కళ్ళెత్తి జానీకేసి చూడలేదు. దొంగతనంగా నైనా ఆమెని పరిశీలించడానికి ప్రయత్నం చెయ్యలేదు. కనీసం అక్కడో అందమైన

అమ్మాయి కూర్చుని ఉంది. ఆ అందం ఏ పాటిదో చూద్దాం అనే కోరికేనా అతనికి కలిగినట్లు లేదు.

ఇదంతా జానీ పరిశీలిస్తూనే ఉంది.

తననీ కృష్ణప్పనీ మార్చి మార్చి చూస్తూ మధ్య మధ్య నవ్వుతూ చలాకీగా అటూ ఇటూ తిరుగుతూఉన్న రావుణ్ణికూడా పరిశీలించింది జానీ .....

కృష్ణప్ప ఎంతో అందంగాఉన్నాడు. రావుడు వట్టి కురూపి.

కృష్ణప్పలో విద్యా, వివేకం, సంస్కారం –

రావుడు శుద్ధమొద్దు –

అయితే – కృష్ణప్ప ఎంత అందంగా ఉన్నా ఒక అచేతనమైన విగ్రహం. కాని రావుడు అలా కాదు – చైతన్యం మూర్తిభవించిన మనిషి.

కృష్ణప్ప ఎంతో సుకుమారి –

కాని రావుడు ... రావుడు ... ఆపైన ఆలోచించడానికి జానీ సంకోచించింది.

మర్నాటినుంచీ కెప్టెన్ రావు కృష్ణప్పని పరిశీలిస్తూనే వున్నాడు ... ఓ కంట కనిపెడుతున్నాడు కూడా ... వయస్సులో వున్న కుర్రాడు ... వంటరిగా చూసి పలకరించవచ్చు ... కబుర్లు చెప్పి ఆకర్షించవచ్చు .. చనువు పెంచుకొని ఏమైనా తొందరపడవచ్చు – చెప్పలేం. ఏమైనా వయస్సు అటువంటిది ... జానీకిమాత్రం ఏమంత ప్రపంచ జ్ఞానం ఉందని? అదీ వయస్సులో ఉన్న పిల్లే! ఏమో ... తర్వాత ఏమనుకొనీ లాభంలేదు ... సంబంధం కుదిరి ... ఇద్దరూ భార్యాభర్త లైతే ఆ తర్వాత వాళ్ళు ఎలా ఉన్నా ఫర్వాలేదు ... కాని ముందే వాళ్ళు తొందరపడితే – ఆ తర్వాత ఈ సంబంధం కాక మరో సంబంధానికి వెళ్ళవలసివస్తే – ?

అందుకే ... ఎందుకేనా మంచిది, తన జాగ్రత్తలో తను ఉండాలి ... తను అప్రమత్తంగా ఉంటే చాలు ... తను కన్నుగప్పి ఎవరూ జానీని ఏం చెయ్యలేరు ... జానీ రూమ్‌వైపు ఓ కన్నువేసి ఉంచాలి ... గుమ్మం కనిపిస్తూ ఉంటుంది – తన పక్క వరండాలోకి మార్పిస్తే సరి ... ఎందుకేనా మంచిది జానీని ఓ మాటు హెచ్చరిస్తే–

ఇలా కెప్టెన్ రావు, ఆ రోజునుంచీ మాంచి ఎటెన్షన్‌లో ఉంటూ వచ్చాడు. మధ్యమధ్యన రావుణ్ని పిలిచి కృష్ణప్ప ఇంట్లోవున్నాడా, తను లేనప్పుడు జానీ రూమ్‌వైపు

వచ్చాడా, ఏ సమయంలోనైనా వాళ్ళిద్దరూ ఏకాంతంగా మాట్లాడుతున్నారా, ఓ రాత్రివేళ జానీ గదిలో ఏవో కబుర్లు వినిపిస్తున్నాయి చూడు, ఇంకా జానీగదిలో లైటు వెలుగుతోంది. నిద్రపోయిందో లేదో చూసిరా, నేను అలా బైటకి వెళుతున్నాను కాని నేను వచ్చేదాకా నువ్వుకాస్త జానీతో కబుర్లు చెబుతూవుండు, నా సేవలకేంలే, నువు తరచుగా జానీనే కనిపెట్టుకొని వుండు. వీలైనంతవరకు వంటరిగా ఉండనీయకు - ఏమో - ఇద్దరూ వయస్సులో వున్నవాళ్ళు - ఎప్పుడు ఎవరిబుద్ధి ఎలా వుంటుందో ... ఇదిగో ఈ రూపాయి పెట్టి ఏవైనా కొనుక్కో .... అంటూ సకల జాగ్రత్తలూ తీసుకున్నాడు కెప్టెన్ రావు.

రావుగారు తనతో ఇలా, ఏవేవో కబుర్లు చెబుతూ; రకరకాల పురమాయింపులు పురమాయిస్తూ, రోజు మొత్తంలో ఉండడానికే ఆదేశిస్తూంటే, "అలాగే ... అలాగే ... మీ యిష్టం ... తప్పకుండా" అంటూ పదహారు పళ్ళూ బయటపడేలా వెర్రి నవ్వొకటి నవ్వేసేవాడు రావుడు ...

తన కూతురుకి ఏదైనా అవాంతరం జరిగితే ఒక్క కృష్ణప్ప వైపునుంచే - కనుక ఆ దిక్కుగా ఎంతో ఎటెన్షెన్‌గా ఉన్నాడు కెప్టెన్‌రావు ...

కాని నిజమైన ప్రమాదం మరో దిక్కునుంచి వచ్చేసరికి అవాక్కయి పోయాడు రావు.

అయిదారు రోజులు గడిచాక ఓ రోజు పొద్దున్నే జానీ తన రూమ్‌లో కనిపించలేదు ... ఆ రోజు రావుడూ పనిలోకి రాలేదు ... కంగారుగా తోటలూ, దొడ్లూ, గదులూ అన్నీ వెతికేశారు ... చివరికి జానీ గదిలో టేబిల్ లైటు కింద కనిపించింది అంటూ ఓ చీటి తీసుకొచ్చాడు కృష్ణప్ప. రావు ఆతృతగా విప్పాడు.

"డియర్ డాడీ!

నాకు పెళ్లి చెయ్యాలనేకదా మీరు తొందరపడుతున్నారు! ... ఆ తొందరలోనే మీరు కృష్ణప్పుని నిర్ణయించబోతున్నారు. కాని నాకు కావలసింది మరోనాజూకైన అందమైన అమ్మాయి లాంటి అబ్బాయి కాదు. ఆడది కోరుకునేది చదువూ డబ్బు వున్నవాడిని కాదు - వట్టి మగాడిని ... నూటికినూరు పాళ్ళు మగాడిని - అలాంటి మగాడు రావుడు - అందుకే అతనూ నేనూ కలిసిపోతున్నాం. ఎలా బతుకుతాం అని భయపడకండి - మీరు నా పేర వేసిన లక్షలాది డబ్బు తాలూకు బేంక్ ఎకౌంట్లు ఎఫ్.డి.లతో సహా అన్నీ నా దగ్గర వున్నాయి. మా కోసం ప్రయత్నం

చెయ్యకండి – మళ్ళీ మీకు కనిపించేది, మీరు తాతగారు అయ్యాకే. దీవించండి –

మీ జానీ"

కెప్టెన్ రావుకి లోకం అంతా ఒక్కసారి గిర్రున తిరిగినట్లయింది ... తూలి పడబోయి కుర్చీని ఆనుకుని నిలబడి ఆ ఉత్తరం కేసి మళ్ళీ చూశాడు – అది తననీ తన జాగ్రత్తనీ, అప్రమత్తతనీ గేలి చేస్తున్నట్లుంది ... తను ఎప్పుడూ ఎటెన్షన్‌లో ఉంటాడు ... కాని ఇప్పుడు తన ఎటెన్షన్ ఏమైంది? ... ఏమైంది? –

(స్వాతి, సెప్టెంబర్ 1980)

---

*